# ఫి-నిష్

ఎం.ఎస్.రామకృష్ణ

**ఆంధ్రయ్య పుట్టినప్పుడే చెప్పాడు ఆ ఊరి గుడి పూజారి — "వీడి వల్ల మన ఊరిపేరు మారుమోగిపోతుంది — మంచిగానో, చెడుగానో — తప్పదు" అని.**

ఆంధ్రయ్యకు ఆ పేరు పెట్టటానికి కూడా కారణం ఉంది. మన రాష్ట్రం అవతరించిన కొద్ది రోజులకే పుట్టిన కొడుక్కి అలా నామకరణం చేసి తన దేశ భక్తిని చాటుకున్నాడు, గరటయ్య.

★ ★ ★

"సారులూ! ఇవాళ మనం పండుగ చేసుకోవచ్చు" అంటూ వచ్చాడు గురువులు.

"ఏమైంది గురువులూ! హుషారుగా ఉన్నావు" అంటూ ప్రశ్నించాడు షాహుకారు నాగభూషణం.

"ఆఁ ఏముంది మళ్లీ లాటరీలో ఒక పదో, ఇరవయ్యో తగిలి ఉంటాయి." తన అనుమానం వెలిబుచ్చాడు పదవిపోయిన ప్రెసిడెంట్.

"అబ్బా! వాడిని సంగతేమిటో చెప్పనివ్వండి. మీ కంతా తొందరే" అంటూ స్నేహితుల్ని ఆపి, సంగతేమిటో చెప్పమన్నట్లుగా గురువులు వంక చూశాడు ఆంధ్రయ్య.

"మద్దేనేళ మన ఊర్లో ఆగిన బండిలోంచి ఓ ఆడమనిషి దిగింది. పట్నం పోవాలంట. టికెట్టు లేదంట. టీ.సీ గారికి ఫైన్ కట్టటానికి డబ్బులేదంటే, మధ్యన ఇక్కడ దింపేసినాడంట. తోడు ఎవరూ లేరు. నేను ఇందాక కలిసి విషయం అడిగాను. ఆ తర్వాత సాయంత్రం మా సారులు వస్తారు. వారికి నీ విషయం చెప్పి, సాయం చేయమని నేను చెపుతాను. నీకేం భయంలేదు అని చెప్పాను." అసలు సంగతి చెప్పాడు గురువులు.

"అయితే మనం ఏం చేద్దాం?" అడిగాడు షాహుకారు.


"గురువులు మనకు ఏదో దాస్తున్నట్లుగా ఉంది. ఏంటబ్బా అది?" ఆలోచనలో పడ్డాడు మాజీ ప్రెసిడెంట్.

"అంత ఆలోచన ఎందుకు ప్రెసిడెంటూ? ఆమెకు తోడు ఎవరూ లేరు. పట్నం పోవటానికి డబ్బులు కావాలి. మనం ఇస్తే సరి. ఇచ్చి పంపిద్దాం. అయితే ఈ రాత్రికి ఏర్పాట్లు మన గురువులు చూసుకుంటాడు. అంతేనా గురువులూ?" విషయాన్ని విడమర్చి చెప్పాడు, ఆంధ్రయ్య.

"అద్గదీ సంగతి. ఎలాగైనా ఆంధ్రయ్య బాబు పద్ధతే వేరు. నా కో వంద కొట్టారంటే మిగతా యవ్వారం నేను చూసుకుంటా. ఫినిష్" అంటూ చేయి జాపాడు. ప్రెసిడెంటు జేబులోంచి డబ్బు తీసి వాడి కిచ్చి పంపేశాడు.

★ ★ ★

**ఆంధ్రయ్య పుట్టిన వేళా విశేషమో, అంతకుముందు గరటయ్య పడ్డ శ్రమ ఫలితమో అతి తక్కువ కాలంలో ఆ ఊళ్లో ఉన్న పెద్ద రైతుల జాబితాలోకి చేరిపోయాడు.**



కొడుకునీ ఆఫీసరుగా చేయాలని కలలు కని పట్నంలో ఉన్న కూతురు ఇంట్లో ఉంచి బళ్లో వేశాడు. బావగారి భయం వల్ల కొంత, తండ్రి మాట మీద గౌరవం కొంత, మొదట్లో బాగానే సాగిన చదువు, రాను రాను మందకొడిగా తయారై, స్కూలు ఫైనల్‌కు వచ్చేసరికి గుంట కొట్టి గంట వాయించింది. రెండు మూడుసార్లు ప్రయత్నించినా పరీక్షల్లో నెగ్గలేకపోయాడు.

అంతలో తండ్రి మంచాన పడటంతో పట్నం వదలి మళ్లీ స్వగ్రామం చేరాడు ఆంధ్రయ్య. అయితే తండ్రి కోరికను మన్నించి పొలం పనులు చేయటానికి మాత్రం నిరాకరించాడు. "పెద్దోడు అలా పగలూ, రాత్రీ కష్టపడుతుంటే వాడికి సాయం చేయవేంరా గాడిదకొడకా! పట్నం పంపి చదివించింది ఎందుకూ! డబ్బుదండగ" అని తిట్టినా పట్టించుకునేవాడు కాదు.

అదే సమయంలో ఆ ప్రాంతంలో ఒక అనుకోని పరిణామం జరిగింది. ఆ గ్రామంలో ఎవరైనా పని మీద పొరుగూరు వెళ్లాలన్నా, పట్నం పోవాలన్నా, దగ్గరైనా — దూరమైనా రెండెడ్ల బండే గతి. అదీ ఎండాకాలం అయితేనే. వానాకాలం వస్తే బండి బురదలో కూరుకుపోయి జనం నానా అవస్థా పడేవారు. ఆ బాధ పగవాడికి కూడా వద్దురా అని మరీ బాధపడేవారు. ఇంతకీ ఇప్పుడు జరిగిన సంఘటన ఏమిటంటే — ఎవరి పుణ్యమో కాని, ఆ ఊరికి అయిదు మైళ్ల దూరంలో ఉన్న మరో ఊరికి రైల్వే లైన్ పడటం, రైలు స్టేషన్ రావటం.

ఈ రైలు స్టేషన్ పడిన తర్వాత ఆంధ్రయ్య రోజూ ఏదో సమయంలో అక్కడకు వెళ్లిరావటం అలవాటు చేసుకున్నాడు. అక్కడ ఆగే పాసింజరు రైళ్లు ఏ వేళకు వస్తాయో, ఎటు వైపు వెళతాయో బాగా తెలుసుకున్నాడు. పట్నంలో ఎవరికైనా, ఏదైనా పనిబడితే వారికి సాయంగా వెళుతూ ఉండేవాడు. ఒక్కోసారి తానే వెళ్లి వస్తూ ఉండేవాడు. అది మందులుగాని, బట్టలుగానీ, ఎరువులుగానీ, మరేదైనాగానీ.

రోజూ స్టేషన్‌కు వస్తూపోతూ ఉండటంతో అక్కడ పనిచేసే గురువులుతో పరిచయం ఏర్పడి స్నేహంగా మారింది. గురువులు ఏదైనా విషయం చెప్పాల్సి వస్తే, 'సారూ' అని మొదలుపెట్టి 'ఫినిష్' అని పూర్తి చేస్తాడు. "అదేమిటి గురువులూ?" అని ఎవరైనా ప్రశ్నిస్తే "ఏదో సినిమాలో మా గురూగారు 'ఫినిష్' అని గమ్మత్తుగా అన్నారులే. నాకూ అలవాటైపోయింది" అనేవాడు.

గురువులుతో స్నేహం పెరిగాక ఆంధ్రయ్యలో కొంత మార్పు వచ్చింది. ఎవరి పని మీదైనా పట్నం వెళ్లిరావలసి వస్తే వారి పనినిబట్టి కొంత రుసుము వసూలు చేసేవాడు. మరికొన్నాళ్లకు గురువులు ఇచ్చిన సలహాతో సీజనుబట్టి పట్నంలో దొరికే వస్తువులు టోకుగా కొనితెచ్చి ఇంటి దగ్గర చిల్లరగా అమ్మేవాడు.


రోజులతోపాటు ఊరు, ఊరితోపాటు జనం,



జనంతోపాటు వారి అవసరాలు పెరిగి ఆంధ్రయ్య ఆ ఊరికి ఒక నిత్యావసర వస్తువైపోయాడు. ఆ ఊరికీ, పట్నానికీ మధ్య వారధిగా మారిపోయాడు. చేతి కింద నలుగురు కుర్రాళ్లను పెట్టుకున్నాడు.

ఎన్నో ఏళ్లుగా ఊళ్లో కిరాణా, వడ్డీ వ్యాపారాలు చేస్తూ రెండు చేతులా వడ్డీలు గుంజుతూ తన పొట్టతోపాటు ఆస్తినీ, భూముల్నీ పెంచుకుపోతున్న షాహుకారు నాగభూషణానికి ఇది నచ్చలేదు. ఎలాగైనా ఆంధ్రయ్యను దెబ్బకొట్టాలని అనుకున్నాడు. దొంగసారా కేసులో ఇరుక్కుని పదవి పోగొట్టుకున్న ప్రెసిడెంట్ దగ్గరకుపోయి, ఏదో చేయాలని వెళ్లి, ఏం చేయాలో దిక్కుతోచక ఇద్దరూ చతికిలబడ్డారు. తర్వాత ఆ ప్రయత్నం తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఆ సంగతి పసిగట్టిన గురువులు వారిద్దరినీ కలసి, 'కలహం కన్నా, స్నేహం మిన్న' అని నచ్చచెప్పి ముగ్గురికీ రాజీ చేశాడు.

అప్పటినుంచీ ప్రతి సాయంత్రం రచ్చబండ దగ్గరో, రైలు స్టేషన్‌లోనో ముగ్గురూ విధిగా కలవటం, ఊరి బాగోగులు గూర్చి చర్చించటం, ఓపికను బట్టి పేకాడటం, అనుకోకుండా తారసపడే అవకాశాలను అందిపుచ్చుకోవటం మొదలైన పనులు కలసికట్టుగా చేయటం



బాలీవుడ్ బాణీ

## శ్రీదేవికి కష్టకాలం

తండ్రి చనిపోవడం, ఆ వేదన నుంచి కోలుకోకముందే సినిమాలలో అవకాశాలు తగ్గిపోవడంతో క్రుంగిపోతున్న శ్రీదేవిని తాజాగా మరో సమస్య వేధిస్తున్నది. తన పంచప్రాణాలుగా ప్రేమించే తల్లి జబ్బుపడి, సీరియస్‌గా ఉండటంతో చికిత్స కోసం ఆమెను అమెరికా తరలించారు. ఆమె త్వరగా కోలుకోవాలని మనమూ ఆశిద్దాం!

మసూద్ అన్సారి

మొదలుపెట్టారు. ఎదురుగా ఊరి 'త్రిమూర్తులు' అనీ, చాటుగా 'దుష్టత్రయం' అనీ ఊరి వాళ్లలో పేరు గడించారు. ఇలా కొంత కాలం గడిచింది.

అంతలోనే వచ్చిపడ్డాయి అసెంబ్లీ ఎన్నికలు. దాంతో 'నే నంటే నేనే'నని ఆ ముగ్గురూ రెండుమూడు రోజులు వాదులాడుకున్నారు. నాలుగో రోజున ఆంధ్రయ్య సలహా మీద కలిసి గురువులు సాలోచనగా వారి సమస్యను విని తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చాడు. "సారులూ! మీరు ఈ ప్రాంతానికి త్రిమూర్తులు అంటారు. అందుకని నేను ఎవరి పేరునో చెప్పి, మిగిలిన వారికి కోపం తెప్పించలేను. అందుకని ఈ పాలికి ఈ విషయంలో తమరు నన్ను వదిలేయాలి తప్పదు."

దాంతో వారు మళ్లీ సందిగ్ధంలో పడ్డాడు. తమ సమస్య పరిష్కారమౌతుందన్న ఆనందంతో వచ్చిన వారు విచార వదనాలతో నిలబడి ఉండటం చూచి గురువులుకు జాలివేసింది. అందుకు "అయ్యలూ! ఊరి పెద్దలు మీ రిలా ముఖాలు వేళ్లాడేసుకుని ఉండటం నాకు సుతరామూ ఇష్టంలేదు. అందుకని ముగ్గురూ ఇష్టపడితే నేను మీకు ఓ సలహా చెపుతా! మనస్ఫూర్తిగా ఇష్టపడితేనే! ఆనక నన్ను తిట్టి లాభంలేదు!" అని అన్నాడు.

దాంతో వారి ముఖాలు విప్పారాయి. కాసేపు గుసగుస లాడుకుని 'గురువులు ఏం చెప్పినా వింటాం' అని ప్రమాణం పూర్తిగా చెప్పారు. దానికి గురువులు "నేను మూడు చీట్ల మీద మీ పేర్లు రాసి కలిపి ఇక్కడో ఉంచుతాను. మీలో ఎవరో ఒకరు ఒక చీటీని తీయండి. ఎవరి పేరు వస్తే వారు ఎన్నికలలో నిలబడాలి. మిగిలిన ఇద్దరూ వారికి సాయపడాలి. ఆనక వచ్చిన లాభాలను అందరూ పంచుకోవాలి. అదీ నా సలహా! అంతకుమించి సలహా నాకు తట్టలేదు. ఆనక

మీ ఇష్టం. ఆలస్యం చేస్తే అక్కడ కాగితాలు వేసే టైం కూడా అయిపోతుంది" అని చెప్పాడు.

ఆ లాటరీ పద్ధతి వారికి నచ్చింది. గురువులు ఆఫీసు గదిలోకి వెళ్లి మూడు చీట్లతో తిరిగి వచ్చారు. వారి కోరిక మీద అతనే చీట్లను చిన్న డబ్బాలో వేసి అటూ ఇటూ ఆడించి ఒక చీటీని పైకి తీశాడు. వారి ముఖాలలో టైంబాబు చేతిలోనే పేలిపోతుందేమోనన్న ఆందోళన, అంతకుమించి పక్కనున్న వాడిచేతిలోది ముందుగా పేలిపోతే బాగుండునన్న ఆత్రుత గురువులుకు కనబడింది.

ఏమైతేనేం గురువులు, చీటీ తెరిచి పేరు చదివాడు.

"ఆంధ్రయ్య!"

అంతే మిగిలిన వారి గుండెలు ఒక్క నిముషంపాటు లయ తప్పి, ప్రమాదం గుర్తుకు వచ్చి, మళ్లీ యథాప్రకారం కొట్టుకోవటం మొదలుపెట్టాయి. ఆ మర్నాడే పట్నంలో ఆంధ్రయ్య నామినేషన్ దాఖలు చేసిన తర్వాత, ఎవరెవరు ఏయే పనులు చేయాలో ఎంతెంత తమ వాటా కింద ఖర్చుపెట్టాలో నిర్ణయించుకున్నారు. రంగంలోకి దూకారు.

అనుకున్న ప్రకారం నలభై రోజుల తర్వాత ఆంధ్రయ్య ఆ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికైనాడు. ఆ సంగతి అధికారికంగా తెలిసిన వెంటనే మిత్ర బృందాన్ని వెంటేసుకుని హైదరాబాదు చేరుకున్నాడు.

రాష్ట్ర రాజధానిలో దిగంగానే ఒక మంచి హోటల్‌లో గదులు తీసుకుని పనులు ముగించుకుని, అప్పటికే ఈ రంగంలో తనకు పరిచయమైన వారిని కలసివస్తానని, మిత్రులను బాగా విశ్రాంతి తీసుకోమని చెప్పి సెక్రటేరియట్‌కు వెళ్లిపోయాడు ఆంధ్రయ్య. అక్కడ మంత్రివర్గంలో ఎవరెవరు ఉండవచ్చో, మరి ఎవరెవరికి అందులో స్థానం ఉంటుం దనుకుంటున్నారో, వారి గూర్చి బాగా వాకబు చేశాడు. తనకు తెలిసిన వారెవరైనా మంత్రులయ్యే గీత ఉందో, లేదోనని విచారించాడు. నేడు కాకపోతే రేపు జరగబోయే మంత్రివర్గ విస్తరణ కార్యక్రమంలో అలాంటి వారు ఒకరిద్దరు ఉండవచ్చునని తృప్తి చెందాడు.

ఒక రోజున వారు నగరంలోని అతిపెద్ద బారులో ఉన్న స్పెషల్ రూంలో కూర్చుని బీరు సేవిస్తున్న సమయంలో, ఎమ్మెల్యే ఆంధ్రయ్య గొంతు సవరించుకుని "మిత్రులారా ! మీ ఆశీర్వాదం, అండదండలతో నేను ఎమ్మెల్యే నయ్యాను. ఒక ఏడాది కూడా గడిచింది. ఆ సందర్భంగానే ఈ పార్టీ. అయితే మీరు నాకు చేసిన సాయానికి మీ కోరికలు ఏమైనా తీరుద్దామని అనుకున్నాను. అందుకని ఎవరికి ఏం కావాలో చెప్పండి. తీరుస్తాను" అన్నాడు.

పొట్ట సవరించుకుంటూ షాహుకారు అడిగాడు.

"ఆంధ్రయ్యా ! మ నూళ్లో నా కో బార్ పెట్టాలని ఉందయ్యా ! తాలూకాలో అంతకంతకూ మన ఊరు పెద్దదైపోతున్నా అక్కడ బార్ లేకపోవటం నాకు నామోషీగా ఉంది" అని మొదట తన కోర్కెను బయటపెట్టాడు.

"మరోటి ఆంధ్రయ్యా ! నా అల్లుడు ఇక్కడ ఏదో సినిమా కంపెనీలో పనిచేస్తున్నాడు. నీకు తెలుసుగా. వాడికి సినిమా హాల్లో చేయాలని కోరిక. అదేదో మ నూళ్లోనే మన హాల్లోనే అయితే బాగుంటుంది. పైగా అల్లుడూ, కూతురూ ఇంట్లోనే ఉంటారు" తన రెండో కోరికను కూడా తెలియచేశాడు షాహుకారు.

"ప్రెసిడెంట్‌గారూ ! మీ కేం కావాలి?" ప్రశ్నించాడు ఆంధ్రయ్య.

"మన ఊరికి లేని కొరతలు మనోళ్లు నీ సాయంతో తీరుస్తున్నారు. ఇంకా నా కంటూ ఏ కోరికా లేదు. నేను ఎప్పుడూ మన ఊరి బాగు కోసమే ఆలోచిస్తూ ఉంటాను. ఏం చేసినా ఊరి కోసం — ఊరి జనం కోసం. అన్నట్లు చెప్పటం మరిచాను. మేం ఎప్పుడైనా నీ కోసం ఇక్కడకు రావాలంటే రెండు బస్సులో, రెండు రైళ్లో మారి రావాలి. పైగా నువ్వు ఎమ్మెల్యేవి. నీకు బస్సు, రైలు ఛార్జీలు లేవు. మా కో — తలో వంద రూపాయలు వదులుతాయి. అందుకని అదేదో స్కీము కింద డీలక్స్ బస్సుకు పర్మిషన్ ఇస్తున్నారట గదా ! ఆ లైసెన్స్ ఏదో నాకూ ఇప్పించు — మనవూరి నుంచి ఎకాయెకిన హైదరాబాదుకు వచ్చేట్లుగా" అంటూ తనకు ఏమాత్రం ఇష్టంలేనట్లుగా ముఖం పెట్టి మరీ అడిగారు మాజీ ప్రెసిడెంట్‌గారు.


"ఓహో ! మీరు నిజంగా జనం కోసం పాటుబడే వాళ్లు. అందుకే ఇలాంటివి అడుగుతున్నారు. అయితే బారు పెట్టటానికి, సినిమా హాలు కట్టటానికి కావల్సిన స్థలం ప్రభుత్వ బంజరు ఏదైనా ఉందేమో చూడండి. వాటి నిర్మాణానికి, కొత్త బస్సు కొనటానికి తక్కువ వడ్డీకి ప్రభుత్వ ఋణ సదుపాయం ఏదైనా ఉందేమో నేను కనుక్కుంటాను. ఇప్పుడు అసెంబ్లీ జరుగుతోంది. చిన్నప్పుడు బడికి ఎలానూ సరిగా వెళ్లలేదు. ఇప్పుడు కనీసం ఈ పెద్దల బడికన్నా వెళ్లి రాజకీయ వ్యవహారాలు బాగా నేర్చుకోవాలి. మీరు ఇంటికి వెళ్లి మీ పని మీద ఉండండి. నేను ఇక్కడ నుంచి మిగతా వ్యవహారం చక్కబరుస్తాను" అని మిత్రులకు అభయం ఇచ్చాడు.

'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా?' అని చిన్నప్పుడు చదువుకున్నాం. ఇప్పుడు 'ఎంఎల్‌ఏ (లేదా రాజకీయ నాయకులు) తలుచుకుంటే డబ్బులకు కొదువా?' అని మార్చి చదువుకొనవలసిన పరిస్థితులు. ఆరు నెలలు గడిచేలోపునే ఊరి నుంచి రైలు స్టేషన్‌కు వెళ్లేదారిలో పక్కగా ఉన్న బంజరు స్థలం 50 సంవత్సరాలు లీజుకు తీసుకుని నాగభూషణంగారి బారు, వారి అల్లుడుగారి సినిమాహాలు తయారయ్యాయి. ప్రెసిడెంటుగారి బస్సు పర్మిట్ కోసం ఆర్టీసీ

## చీమలకూ ఏ.సి... !

ప్రపంచంలో మరే చీమలకూ సాధ్యంకాని రీతిన తమ నివాసాలను ప్రత్యేకంగా నిర్మాలించుకోగలవు ఆస్ట్రేలియా అటవీ ప్రాంతంలో కనిపించే చీమలు. ఈ చీమల నివాసాలకున్న అతి విశిష్టమైన ప్రత్యేకత ఏమిటంటే... తమ నివాసాలలో చల్లదనం ఉండేందుకుగాను వెజిటబుల్ వల్ప్‌తో ఈ చీమలు తమ నివాసాలలోకి ప్రత్యేక సొరంగ మార్గాలు ఏర్పరచుకుంటాయి. ఈ సొరంగాల మూలంగా వీటి నివాసాలు... ఎ.సి. గదుల్లా ఎంతో చల్లగా ఉంటాయని వీటిపై పరిశోధనలు చేసిన శాస్త్రజ్ఞులు చెవుతున్నారు. మనుమలకే కాదండోయ్ ఎ.సి. గదులు... చీమలకు కూడా అవసరమేనన్నమాట !

సేకరణ: మల్లెంశెట్టి లక్ష్మణరావు
[పిడుగురాళ్ళ]



అధికారులతో మాట్లాడి అన్నీ సిద్ధం చేశాడు ఆంధ్రయ్య. సరికొత్త బస్సు బ్యాంకు లోనుతో కొని బారుకూ, సినిమాహాలుకూ మధ్య ఉన్న ఖాళీ స్థలంలో సినిమా నాయికలాగా అలంకరించుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

అన్నీ పనులూ అయిన తర్వాత ఆంధ్రయ్య హైదరాబాద్ పరిగెత్తాడు. ఆ జిల్లా మంత్రిని అమాంతం కలుసుకొని తన మిత్రుల గూర్చి చెప్పి, మూడింటికీ ఒకే రోజు ప్రారంభోత్సవం జరగాలని పట్టుబట్టి పి.ఏ.గారి సాయంతో, మిగిలిన ప్రోగ్రాంలను సర్ది, తాను అనుకున్న తేదీకి ఆయనను ఒప్పించి, అదే వేగంతో వెనక్కి వచ్చాడు.

మర్నాడే ప్రారంభోత్సవ శుభదినం. వార్తా పత్రికల్లో ప్రకటనలు భారీగా వేయించాడు. తాలూకా మొత్తం అదిరిపోయేలా ఆర్భాటం చేశాడు. వందల మందికి ఆహ్వానాలు పంపించాడు. రిబ్బను కత్తిరించగానే అరగంట సేపు వరకూ ఆగకుండా పేలేంత బాణసంచాను కొని బుట్టలో పెట్టి బస్సు పక్కగా ఉంచమని పనివాళ్లకు చెప్పాడు. రాత్రి పదిగంటల వరకూ ఆ పనీ, ఈ పనీ చేసి అలసిపోయాడు. రేపటి కార్యక్రమంలో ఏ చిన్న లోపమూ ఉండకూడదని, చివరిసారిగా పనివాళ్లను హెచ్చరిద్దామని ఆ ప్రాంగణానికి వచ్చాడు, మన ఆంధ్రయ్య.

"రావోయ్ ! నీ కోసమే చూస్తున్నాం. నువ్వు చేసిన ఈ సాయానికి మేం ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియటంలేదు. అయినా మా తృప్తి కోసం ఒక పెగ్ ఈ పూట వేసుకుందాం, మన బార్" అంటూ మిత్రద్వయం పట్టుబట్టింది. పక్కనే గురువులూ ఉన్నారు. వాడికి సారా ఆరోప్రాణం. ఇంకా సీసాలో నాటు సరుకు అంటే చెప్పక్కర్లేదు.

"అవును సారూ ! ఇది రేపటి నుండి మనది గాదు పాసెంజర్లది. అందుకని ఒక్కసారి —, — ఫినిష్" అన్నాడు తన బాణీలో గురువులు నోరు చప్పరిస్తూ. ఇక ఒప్పుకోక తప్పించిదికాదు ఆంధ్రయ్యకు.

"అయితే లోపల వద్దు. రేపు ఉదయం మంత్రిగారు వచ్చేవరకూ అవి నీటుగా ఉండాల్సిందే. ఇలా బయటనే కుర్చీలు వేసుకుని కూర్చుందాం" అని చెప్పాడు. వెంటనే కుర్చీలు, బల్ల, సీసాలు, సోడాలు, గ్లాసులు, సిగరెట్లు మొదలైన వాటి ఏర్పాటు క్షణాల్లో జరిగిపోయాయి.

ఒక పెగ్ అంటూ కూర్చున్న వారు మరో సున్నా దాని పక్కన చేరినా కుర్చీలోంచి కదలనే లేదు. ఎన్ని సిగరెట్లు బూడిదగా మారిపోయాయో లెక్కలేదు. చివరికి వారు కూర్చునే పరిస్థితిలోంచి క్రింద పడిపోయే స్థితిలోకి వచ్చారు. ఆఖరు సిగరెట్‌ను ఆంధ్రయ్య గట్టిగా దమ్ములాగి దూరంగా విసిరికొట్టాడు.

అది సరాసరి వెళ్లి టపాకాయల బుట్ట మీద పడింది.


అంతే —

నిముషంలో ఆ ప్రదేశం అంతా భయంకరమైన శబ్దాలతో, హాహాకారాలతో నిండిపోయింది.

* *

ఆంధ్రయ్యతోపాటు ఘోరంగా మరణించిన వారి ఆనవాలు పట్టడానికి కష్టంగా ఉన్నా, శవాలను చూస్తూ ఆ ఊరి గుడి పూజారి మళ్లీ అన్నాడు — "వీడు పుట్టినప్పుడే చెప్పాను. వాడి వల్ల మన ఊరి పేరు మ్రోగిపోతుంది. మంచిగానో, చెడుగానో — తప్పదు అని" నిర్వికారంగా చెప్పాడు. ●


## బాలీవుడ్ బాణీ



### కోటి వద్దన్న మాధురి

'బేవఫా సనమ్' చిత్రం విజయం సాధించడంతో, తన తమ్ముడు కిషన్‌కుమార్ నిజంగా హీరో అయిపోయాడనే గట్టి నమ్మకంతో ఉన్నాడు గుల్షన్ కుమార్. నడవని చిత్రాలను కూడా బాక్సాఫీసు వరకు లాక్కురావడంలో ఆయనకు ఆయనే సాటి అనే వాస్తవం అందరికీ తెలిసిందే. కిషన్ హీరోగా త్వరలో నిర్మిస్తున్న మరో చిత్రానికి హీరోయిన్‌గా మాధురీ దీక్షిత్‌ను బుక్ చేసేందుకు, ఆమెకు కోటి రూపాయలు ఇస్తానని ఆఫర్ చేశాడట. అయినప్పటికీ డేట్స్ కుదరవనే సాకుతో మాధురి ఈ ఆఫర్ తిరస్కరించినట్లు వినికిడి. డేట్స్ కుదరకనా? లేక 'చెక్క మొహం'తో నటించడం ఇష్టంలేకనా? దానికి జవాబు మాధురే చెప్పాలి మరి !

మసూద్ అన్సారి



## ఆ పద్యం రాసింది నేనురా!

సేకరణ :
భూక్యా గోపీనాయక్
(చిలకలూరిపేట)

'గయోపాఖ్యానం' గాలి వీస్తున్న రోజులవి. వారంలో ఏడు నాటకాలు ఆడితే కనీసం నాలుగు నాటక ప్రదర్శనలు గయోపాఖ్యానం. అంత ప్రచారంలో ఉండేది. చిలకమర్తివారు రాజమండ్రిలో ఉండేవారు. వారు పుట్టుగుడ్డి కాకపోయినా, మధ్యవయసులోనే చూపు మందగించి బొత్తిగా కనిపించేది కాదు.

అనుముల వేంకటశేషకవిగారు యువకులు, అవధాని. ధార ధోరణి మాంచి ఊపులో ఉండేవి. ఒకరోజు రాజమండ్రి వెళ్లిన కవిగారు చిలకమర్తివారిని కలిశారు. ఆ సాయంకాలం ఇద్దరూ పార్కుకు వెళ్లారు.

అక్కడో కుర్రాడు గయోపాఖ్యానంలోని పద్యం "నిటలాక్షుండి పుడిత్తి వచ్చినను రానీ .." చదువుతున్నాడు. కమ్మని కంఠం, మంచి పలుకు. పద్యం పూర్తయింది.

చిలకమర్తివారు అతన్ని రమ్మని పిలిచి చేతికర్రతో కొట్టారు. పెద్దాయన పిలిచి కొట్టినందుకు కోపం వచ్చినా తమాయించుకుని "ఎందుకు కొట్టారండీ?" అని అడిగాడు ఆ యువకుడు.

"పద్యం తప్పు చదివావు. అందుకు కొట్టాను."

"తప్పు చదివానా! అయితే మీ కేమిటి?"

"నా కేమిటా? ఆ పద్యం రాసింది నేనే, వెధవా! నా పద్యం నా ముందు తప్పుగా చదివితే ఎలా ఊరుకుంటాను?" అని గట్టిగా మందలించారు కవిగారు.

ఆ కుర్రాడు విస్తుపోయి, ఆపై ఆనందపడిపోయి కాళ్లకి దండం పెట్టాడు.